క్లుప్తంగా

పాకాల మరమ్మతులకు అనుమతి ఇవ్వాలి



నర్సంపేట : పాకాల తూములు, లైనింగ్ మరమ్మతులకు అనుమతి ఇవ్వాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. తూముల లీకేజీతో ఐదారు వేల ఎకరాలకు ఉపయోగపడే సాగునీరు వృథాగా పోతుందని, వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని గతంలో కోరామని, ఉప ముఖ్యమంత్రి ఆమోదం పొందినా పనులు ఇంకా మంజూరు కాలేదని తెలిపారు. పట్టణంలో 70వేల మందికి నీరందించే డీఫ్లోరైట్ ప్రాజెక్టు మరమ్మతులకు, పేదల ఇళ్లపై వెళ్తున్న హైవోల్టేజీ వైర్లు తొలగించేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

‘ఎస్సీ వర్గీకరణ ఘనత కాంగ్రెస్ సొంతం’



వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణ చేపట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని, ఇందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఎస్సీ వర్గీకరణ ఆమోదం తీర్మాన చర్చలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ సమస్య నేటితో తీరిపోయిందన్నారు. దశాబ్దాలుగా రావణ కాష్టంలా ఉన్న సమస్యకు ఈ బిల్లుతో పరిష్కారం లభించిందని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోరుకున్న వారు మాలలకు వ్యతిరేకం కాదని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అందరికి సమన్యాయం జరిగేలా కృషి చేస్తారన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగాపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ శాఖ నర్సంపేట డీఈ తిరుపతి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఉపయోగపడేలా డీఆర్ 100 కేవీఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు విద్యుత్‌ను అవసరమైన మేరకు వినియోగించుకోవాలని సూచించారు. దుబారా చేయొద్దని కోరారు. కార్యక్రమంలో నెక్కొండ ఏడీఈ శ్రీధర్, ఏఈ జోగానంద్, తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు..



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కాల్‌నాయక్‌తండాలో ఏంజెల్ హౌస్ వెల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ పంపును బీఆర్ఎస్ నాయకుడు బాదావత్ వీరన్ననాయక్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తండావాసులు చేతిపంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్‌గౌడ్, నాయకులు గుగులోతు రవి, లక్ష్మణ్, బెన్నీ, ఆంగోతు గోవింద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



రాయపర్తి : మండలంలోని మైలారంలోని గుడిపూడి సోమన్న నివాసంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.16,450 ఇలువైన గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఎస్సై శ్రీధర్ వివరాలు వెల్లడించారు. గుట్కా ప్యాకెట్లను నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామని, సోమన్నపై కేసు నమోదు చేశామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సంపేట : చెన్నారావుపేట, ఉప్పరపల్లి, అమీనాబాద్ గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో నేడు (బుధవారం) మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ తిరుపతి, ఏఈ జోగానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇందిరమ్మ మో‘డల్’ హౌస్

- నత్తనడకన నమూనా ఇంటి నిర్మాణం
- గడువు దాటినా పూర్తి చేయని వైనం



పునాది దశలో ఉన్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

సంగెం : ఇందిరమ్మ మోడల్ హౌస్ (నమూనా ఇల్లు) నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. మోడల్ హౌస్ పునాదులకే పరిమితమైంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కల నెరవేర్చుతామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో (ఎల్1) అర్హులకు సొంత స్థలం ఉంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే మండలానికి ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేసి విడతల వారీగా అమలు చేసే ఇందిరమ్మ ఇళ్లతోపాటు రేషన్ కార్డులు, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలను ఒకే దఫాలో అమలు చేసే కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలో మండలంలో షాపూర్ ఎంపికైంది. గ్రామంలోని 39 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా పలువురు ముగ్గు పోసి నిర్మాణాలు ప్రారంభించారు. ఇతర గ్రామాల్లోను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక చేయడానికి సర్వే పూర్తి చేశారు. పథకం ద్వారా అర్హులకు రూ.5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించిన క్రమంలో ముందుగా మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ నిర్మించాలని నిర్ణయించారు. మండల కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ ప్రకారమే లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

పునాదులకే పరిమితం

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్థలంలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. గత ఫిబ్రవరిలో ముగ్గు పోశారు. పునాదులు తీసి వదిలేశారు. దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఇంకా పునాదుల్లోనే ఉండడంతో మోడల్ హౌస్ నిర్మాణంలో అధికారులు విఫలయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నవి.

జాప్యానికి కారణాలేమిటో..?

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణమే ఇలా ఉండడం లబ్ధిదారులను అసహనానికి గురి చేస్తోంది. నమూనా ఇంటి నిర్మాణం ఆలస్యానికి కారణాలేమిటో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. నమూనా ఇంటి నిర్మాణం మొదలు కాకుండానే మోడల్ గ్రామంలో ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక మిగిలిన గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక జరగాల్సి ఉంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. కాంగ్రెస్ పాలనలోనైనా సొంతింటి కల నెరవేరుతుందో? లేదో? అని పేదలు ఎదురు చూస్తున్నారు.

> **త్వరలో పూర్తి చేస్తాం**
>
> మోడల్ హౌస్ నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తాం. మిగిలిన చోట్ల పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం విధించిన గడువులోగా నమూనా ఇంటి నిర్మాణం చేయాల్సి ఉండగా జాప్యం జరిగింది. ఐరన్ సమకూరింది. పనులు మొదలు పెట్టి త్వరలో పూర్తి చేస్తాం.
>
> – వేణు, ఏఈ, హౌసింగ్ శాఖ

వర్సిటీకి ‘సురవరం పేరు’ అభినందనీయం

- సాధన సమితి కార్యదర్శి కుమారస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నల్లబెల్లి : తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగిస్తూ సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెడుతూ అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. సంబంధిత బిల్లును అసెంబ్లీ కౌన్సిల్ ఆమోదించడంతో ప్రతాప్‌రెడ్డి పేరు ఖరారైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచడానికి అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ద్వారా చట్టం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీ జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లోనే కాకుండా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలతోపాటు ప్రైవేట్ పరిశ్రమల్లో బీసీలకు వాటా కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు చీకటి ప్రకాశ్, మేడిపల్లి రాజు, కోల లింగయ్య, రాపర్తి సంపత్, జెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వర్ధన్నపేట : సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట : రాజీవ్ యువ వికాస్ పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉపాధి కల్పించేలా పథకాన్ని ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆ పార్టీ నాయకుడు అనిమిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మైస సురేశ్, ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, పత్రి భాను, దుబ్బాక శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో..

పర్వతగిరి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ మాట్లాడారు. యువతకు ఉపాధి పెంచేలా పథకాన్ని తీసుకురావడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, నాయకులు సర్వర్, రమేశ్, వంగ సాయికృష్ణ, వెంకట్‌రావు, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ చిత్రపటానికి..

రాయపర్తి : ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించడంతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర నాయకులు కందికట్ల విజయ్, గబ్బెట బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజు, మండల అధ్యక్షుడు ఐత జంపి, వళపాక కుమార్, ఐత శ్రీనివాస్, సీనపెల్లి రమేశ్, హరిబాబు, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నర్సంపేట : పట్టణంలోని మల్లంపల్లి రోడ్డు, విశ్వకర్మవీధి, తదితర ప్రాంతాల్లో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాశ్ ఆచారి మాట్లాడారు. ఉగాది పండుగ గొప్పతనాన్ని శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక వరంగల్ కమిటీ సభ్యులు కిరణ్, రమణాచారి, విక్రమాచారి, సుదర్శనచారి, డాక్టర్ నర్సయ్య, బ్రాహ్మణ మణి, పద్మ, త్రైతశ్రీ, శశిరేఖ, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలానికి చెందిన పలు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం పరామర్శించారు. రాయపర్తిలోని ఐత వెంకన్న, బొమ్మెర సతీశ్, మైలారంలో బాద వెంకన్న, గాడిపెల్లి సారయ్య, పెర్కవేడులో రాజీమహ్మద్ తల్లి, కొత్తూరులో బొమ్మన నారాయణ సతీమణి, కొలన్‌పల్లిలో వంగాల మారయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఆమె కలిసి మాట్లాడారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, నాయకులు సుధీర్‌రెడ్డి, కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి



కొమురయ్య (ఫైల్)

నర్సంపేట : ఖానాపురం మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చలిగంటి కొమురయ్య(48) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. నర్సంపేట పట్టణంలోని ఆయన నివాసంలో భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, సీనియర్ పాత్రికేయులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలికి చెందిన గాలి బాబు (65) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ మహేందర్ తెలిపారు. వివరాలిలా.. బాబు ఈనెల 3న ఇంటి వద్ద బాత్‌రూంకు వెళ్లి కింద పడిపోగా కాలు విరిగింది. కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్చగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

నివాళి

సంగెం : మండలంలోని కాపులకనపర్తికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి తల్లి లచ్చమ్మ సోమవారం రాత్రి మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు సారంగపాణిని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, మల్లయ్య, వీరాచారి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి



గీసుకొండ : మండలంలోని కోనా యమాకులలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి రియాజుద్దీన్ కోరారు. గ్రామంలోని లబ్ధిదారులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు 450 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలని చెప్పారు. పునాది దశ పూర్తి అయిన తర్వాత ప్రభుత్వం రూ.లక్ష అందిస్తుందని తెలిపారు. విడతల వారీగా లబ్ధిదారులకు మొత్తం రూ.5 లక్షలు అందుతాయని వివరించారు. నిర్మాణంలో ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి హేమలత, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహీమ్, నాయకులు వజ్ర రాజు, లడే సంతోశ్, బూర్గుల వెంకటేశ్వర్లు, కాందారి సంతోశ్, మార్గం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగడి వేలం వాయిదా

నెక్కొండ : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి (వారాంతపు సంత) వేలం ఈనెల 24కు వాయిదా వేస్తున్నట్లు ఈఓ సదానందం ప్రకటించారు. మేకలు–గొర్రెల, తైబజారు (గంపచీటి)లకు 2025–26 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంఈఓ దయాకర్ సమక్షంలో మంగళవారం వేలం నిర్వహించారు. మేకలు–గొర్రెలకు గతంలో (9 నెలలకు రూ.10.50 లక్షలు ఉండగా వేలంలో రూ.11.56 లక్షలకు, తైబజారుకు రూ.1.30 లక్షలకు రూ.1.50 లక్షలకు మాత్రమే కాంట్రాక్టర్లు పాట పాడారు. ప్రభుత్వం నిర్ణయించిన (అప్‌సెట్ ప్రైజ్) కంటే తక్కువకు వేలం రావడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా వేశారు.

కాటమయ్య పండుగ



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలో గౌడ కులస్తులు మంగళవారం కాటమయ్య పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కంఠ మహేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు, కరిమిళ్ల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లిలోని శ్రీదూదల మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు సోమేశ్వర్‌రావు, చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 2001–02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు వేల్పుల సురేశ్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, షార్పనర్లు అందజేసి మాట్లాడారు. పరీక్షలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు పురస్కారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, పూర్వ విద్యార్థులు గటికె నాగరాజు, బోడకుంట్ల కరుణాకర్, మర్రి కుమారస్వామి, పత్తిపాక మల్లికార్జున్, మర్రి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

- సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటనారాయణ



సదస్సులో మాట్లాడుతున్న వెంకటనారాయణ

గీసుకొండ : పంటలకు చెల్లించే మద్దతు ధరను ప్రభుత్వాలు చట్టబద్ధం చేసి, రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. వంచనగిరిలో తెలంగాణ రైతు సంఘం నాయకులు మంగళవారం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయరంగం అభివృద్ధికి ప్రభుత్వాలు సరైన ప్రణాళికలు రూపొందించకపోవడంతో సన్న, చిన్నకారు రైతులు పంటలు సాగుచేయలేని స్థితికి చేరుకున్నారని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా రైతులు సమస్యల సాధన కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు సంఘం సలహాదారు సోమరామ్మూర్తి మాట్లాడుతూ రైతులు తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘాన్ని గ్రామ, మండల స్థాయిలో బలోపేతం చేసి ముందుకు సాగాలని కోరారు. మోకిడి పేరయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు తీర్మానాలు చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఉపాధ్యక్షుడు ఊరటి అంశాలరెడ్డి, కోశాధికారి రవీందర్, మండల కమిటీల నాయకులు పుచ్చకాయల బుచ్చిరెడ్డి, లడే మోహన్‌రావు, బరుపటి రవీందర్, బీమిలి రామారావు, కంచె యాదగిరి, కాల్వ బచ్చయ్య, వేణు, బషీర్ పాల్గొన్నారు. తొలుత ఎండ్లబండ్ల ప్రదర్శన నిర్వహించి సభలో పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో హెచ్ఎం, తదితరులు

నర్సంపేట : పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆర్‌జేడీగా చందన, డీఈఓగా శ్రావణి, ఎంఈఓగా కల్యాణి, హెచ్ఎంగా రిత్విక్, కొందరు ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పొడెం కాంతారావు మాట్లాడారు. విద్యారంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు ఉపాధ్యాయ ఉద్యోగంపై అవగాహన కల్పించే దిశగా కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, రాజేశ్, వాణి, శౌరి అసంతీన, సురేశ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, స్వామి, మల్లయ్య, స్వరూప, సుజాత, నిర్మల, పద్మ, శ్రీలత, కృష్ణయ్య, రాజమౌళి, రమేశ్, న్యాయ నిర్ణేతలు కోడం సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాగృతి స్కూల్‌లో..

చెన్నారావుపేట మండల కేంద్రంలోని జాగృతి స్కూల్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు తరగతులు బోధించారు. కరస్పాండెంట్‌గా మాన్విక్, ప్రధానోపాధ్యాయురాలిగా అభినయశ్రీ, డీఈఓగా అమూల్య, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ప్రతిభ చాటారు. అనంతరం విద్యార్థులను కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ, హెచ్ఎం గోదాదేవి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, రాధిక, గీత, కవిత, సృజన, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

- డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి



రాయపర్తి : మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

రాయపర్తి : చదువుతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని డీసీఈబీ సెక్రటరీ, స్థానిక హైస్కూల్ హెచ్ఎం గారె కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కేవలం మార్కుల కోసం కాకుండా జీవితం గురించి ఆలోచించి చదువుకోవాలని సూచించారు. తొలుత విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్‌రెడ్డి, రోజారాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాత్మ హైస్కూల్‌లో..

యుక్తవయసులో కష్టపడితేనే జీవితం సుఖమయంగా సాగుతుందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక శ్రీ మహాత్మ హైస్కూల్‌లో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో చదువులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. అనంతరం ప్రముఖ కళాకారుడు గిద్దె రాంనర్సయ్య గానంతో విద్యార్థులను చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, కరస్పాండెంట్ రమేశ్, ప్రిన్సిపాళ్లు సరిత, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాధన్నపేట జెడ్పీ సెకండరీ స్కూల్‌లో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేట జెడ్పీ సెకండరీ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం ఆలూరి రామచందు మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రుల, పాఠశాలకు కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు అన్న మహేందర్ అతడి తండ్రి జ్ఞాపకార్థం పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్చన, సుధావాణి, గుడివాడ అశోక్, లీలా, వెంకన్న, విశాల, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశానికి హెచ్ఎం తేజావత్ జయ అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్‌కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యోదయ స్కూల్‌లో..

నెక్కొండ : మండల కేంద్రంలోని విద్యోదయ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని కరస్పాండెంట్ చల్లా నాగార్జునరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించడం సులువని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ చల్లా పారిజాతం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం

- ఇంపాక్ట్ ట్రైనర్ రవిశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్

నెక్కొండ : జీవితంలో విద్యార్థి దశ కీలకమని ఇంపాక్ట్ ట్రైనర్ రవిశంకర్ శ్రీరాములు తెలిపారు. మండలంలోని పెద్దకొర్పోలు గ్రామంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన మోటివేషన్ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షల ఒత్తిడి జయించడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. పరీక్షల పట్ల ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని చెప్పారు. విద్యార్థులు చదువులను బట్టీ విధానంలో కాకుండా అధ్యయన రూపంలో చదివితే ఉత్తమ ఫలితాలు ఖాయమన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) రజిత, తదితరులు పాల్గొన్నారు.